# యాదమ్మ గెలుపు

"అమ్మా!" అది పనిమనిషి యాదమ్మ గొంతు. దాని పని అయిపోయాకా, చెప్పి వెళ్ళడం దానికి అలవాటు.

"వెళ్ళు" వంటింట్లో హడావుడిగా ఉన్న నేను, దానివైపు చూడకుండానే అన్నాను.

"అమ్మా!" మళ్ళా పనిమనిషి యాదమ్మ.

"ఏం, ఇంక వెళ్ళలేదా! ఏం కావాలి?" అంటూ యాదమ్మని చూసాను.

"కొంచెం పైసలు కావాలమ్మా... పాప ఫీసు కట్టాల..."

"యిలా మధ్యలో అడిగితే ఎట్లాగా? జీతం అంతా ముందే తీసుకున్నావు కదే. వేరే యిళ్ళల్లో అడిగి తీసుకో..." అంటూ కూర తరుగుతూండి పోయాను.

"అందర్నీ అడిగాను... పైసలు అందరూ ఇచ్చారు... యింకా తక్కువ పడిందమ్మా..."

చిరాగ్గానే లోపలికి వెళ్ళి డబ్బు యిచ్చి కాలెండర్‌లో నోట్ చేసుకున్నాను.

పదో క్లాసు పాసయిన కూతుర్ని ఇంటర్లో చేర్పించడానికి చేస్తున్న ప్రయత్నం ఇది.

పని చేసి, చేసి కాళ్ళుచేతులు పగుళ్ళు తీసినా, యాదమ్మ ధైర్యంలో కూతుర్ని చదివించాలన్న ఆశలో పగుళ్ళు రాలేదు.

భర్త పోయినా, ధైర్యంగా ఓ లక్ష్యంతో, ఆత్మవి శ్వాసంతో జీవితం సాగిస్తోంది.

ఆ రోజు.....

ఉదయం ఏడు అవుతున్నా యాదమ్మ రాలేదు. అంట్లు అలాగే ఉన్నాయి. పిల్లలిద్దరూ కాలేజి కెళ్ళాలి. నేను ఆఫీసుకి, ఆయన బ్యాంక్‌కి వెళ్ళాలి. హడావుడిగా కుక్కర్ తోమి, అన్నం పప్పు, కూర ముక్కలు అందులో పెట్టి దాన్ని గ్యాస్‌మీద

పెట్టి, వాచ్‌మెన్ పెళ్ళాన్ని పని చేయడానికి రమ్మనమని చెప్దామని, మా ఫ్లాట్ తలుపు తీసుకుని బయటికొచ్చాను.

సరిగ్గా అప్పుడే పక్క ఫ్లాట్ తలుపు తీసుకుని, శ్యామల కూతురు శిరీష బయటికొచ్చింది.

లిఫ్ట్‌లో కిందకి వెళ్తూంటే నాతో అంది – "ఆంటీ! మీ పనిమనిషి యాదమ్మ ఎవరినో చంపిందట కదా!"

యాదమ్మ చంపడమా! స్ట్రేంజ్!

"చంపిందా! నీకెలా తెలుసు? అందుకే యింత పొద్దెక్కినా రాలేదా! నీకెవరు చెప్పారు?" అదుర్దాగా అడిగాను.

"నిజమే ఆంటీ! వాకింగ్‌కి వెళ్ళినప్పుడు మా డాడికి ఎవరో చెప్పారుట."

"వస్తానాంటీ!" అంటూ లిఫ్ట్‌లోంచి బయటకి వెళ్తూ నన్ను అయోమయంలో పడేసింది.

వాచ్‌మెన్ పెళ్ళాం తిరుపతమ్మకి అంట్లు తోమడానికి రమ్మనమని చెప్పి యాదమ్మ యింటికెళ్ళాను.

యాదమ్మ తప్పుచేయదు. ఆమె ఏం చేసినా బాగా ఆలోచించే చేస్తుంది. పదేళ్ళనుంచి నా దగ్గర పనిచేస్తోంది. ఓ మనిషి ప్రాణం తీసిందంటే ఏదో జరిగి వుండాలి.

"ఆంటీ! మా అమ్మని కాపాడండి" నన్ను చూడగానే యాదమ్మ కూతురు స్వరూప బోరుమంది.

"జరిగింది చెప్పు" అంటూ యింటిముందున్న ఓ కుర్చీలో కూచున్నాను. చుట్టూరా జనం మూగారు.

"నేను స్కూల్లో ఉన్నప్పటినుంచి సంతోష్ అనే పిల్లాడు ఇద్దరు ముగ్గురు ఫ్రెండ్స్‌తో నన్ను సతాయిస్తూండేవారు.

"ఇంటర్‌లో చేరాకా, కాలేజి వరకూ వచ్చేవాడు. ఏదో పిచ్చి పిచ్చి మాటలు, పాటలు పాడుతూండేవాడు. ఓసారి, ట్రాఫిక్ పోలీసుకి చెప్పాను.

"పాపా! రోజులు మారాయి. నువ్వు భయపడ్తే, ఇంకా భయపెడ్తాడు. నీ సేఫ్టీ నువ్వే చూసుకోవాలి" అని అన్నాడు.

"యింకోసారి ఓ కానిస్టేబుల్‌కి చెప్పాను. 'అమ్మో వాడా వాడో గూండాలాగా ఉన్నాడు.' నన్ను కాదన్నట్లు వినిపించుకోకుండా వెళ్ళు. అయిన నేను ఈ ఏరియా వాడిని కాను."

"రెండు రోజుల్నించి కాలేజి లోపలికి వచ్చి ప్రేమించమని, పార్క్‌కి రమ్మనమని, సినిమాకి రమ్మనమని అందరిముందూ గొడవ చేస్తున్నాడు."

నేను అమ్మకి చెప్పి; అమ్మని తీస్కొని పోలీసు రిపోర్టు యియ్యాలని అనుకున్నాను. కాలేజీ పిల్లలు కూడా పోలీసు స్టేషన్ వస్తామని అన్నారు.

"నిన్న సాయంత్రం అమ్మ చీకటయ్యాక వస్తే చెప్పాలనిపించలేదు. అలసిపోయి వుంటుంది. నిద్ర కూడా పోదూ నేను చెప్తే. పొద్దున్న చెప్పాలనుకున్నా కానీ పొద్దున్నే పనికి పోయింది. అమ్మ అట్లా వెళ్ళగానే తలుపు మూద్దామనుకుంటూంటే సంతోష్ వచ్చిండు. తలుపు తోసి, లోపలికి వచ్చి నన్ను ప్లాస్టిక్ కుర్చీకి కట్టేసి, నా నోట్లో బట్ట పెట్టి ఒక చేతిలో అగ్గిపెట్టె ఉంది – కిరసనాయిలు డబ్బా మూత తీసి నా నెత్తిమీద గుమ్మరించాడు. 'ప్రేమిస్తావా లేదా! చెప్పు, చెప్పకుంటే చంపేస్తా' అని చాలా గలీజు గలీజు మాటలంటున్నాడు. అరవడానికి నోట్లో బట్టలున్నాయి. చచ్చిపోయాననే అనుకున్నాను..."

అప్పుడే అమ్మ వచ్చి, తలుపు దగ్గర నుంచుంది. సంతోష్‌కి అమ్మ కనపడదు. అందుకని చూడలేదు. అమ్మకంతా అర్థమైంది. తలుపు పక్కన కట్టెలు కొట్టే గొడ్డలి ఉంది. మెల్లగా గొడ్డలి తీసి సంతోష్ నెత్తిమీద కొట్టింది. గట్టిగా అరిచాడు. ఇంకొక దెబ్బ మెడమీద వేసింది. కిందపడ్డాడు. చుట్టుపక్కల వాళ్ళందరికీ వాడి అరుపులు విన్నపడ్డాయి. పొద్దున్నే యిళ్ళముందు నీళ్ళు చల్లి ముగ్గులేస్తున్న వాళ్ళంతా వచ్చారు. తర్వాత పోలీసులొచ్చారు. అమ్మని తీసికెళ్ళారు... ఇందులో అమ్మ తప్పులేదు... అమ్మని రక్షించండి" అంటూ భోరున ఏడ్చింది.

పోలీసు స్టేషన్‌కెళ్ళాను.

"మేడం... ఈ తక్కువ వాళ్ళతో మీకేమిటి? వాళ్ళల్లో వాళ్ళకి చాలా లావాదేవీలుంటాయి. ఏదో గొడవలుండి ఉంటాయి. మధ్య మీరు రాకపోవడమే మంచిది. మీరు చూస్తే చదువుకున్న వారి లాగా ఉన్నారు."

"తక్కువ ఆమె కాదు... నువ్వు..." అందామనుకున్నాను. కానీ ఊరుకున్నాను. బెయిల్ కోసం అడిగితే ఒప్పుకోలేదు. యాదమ్మను చూడటానికి ఒప్పుకున్నారు.

"లీలమ్మా! మా పిల్లని నువ్వే బచాయించినావు. కొంచెం ఆల్చెం అయితే పిల్ల సచ్చిపోతుండె. నీ మూలంగా పాప బతికింది. దేవుడు నా పాపని నల్లగ సూడాల..." అంది ఏడుస్తూ యాదమ్మ నన్ను చూడగానే.

ఆశ్చర్యంగా చూశాను.

నా మూలంగా స్వరూప బతికిందా? ఆమె చావు బతుకులమధ్య దూరం నామూలంగా ఎక్కువయ్యి ఆమె బతికిందా?

"నేనా! నేనక్కడలేను కదా, ఆ టైంలో..."

"నువ్వు లేవు కానీ, నిన్న నువ్విచ్చిన గిన్నెలున్నాయి. కదమ్మా"!

"ఏం గిన్నెలిచ్చాను?" ఆలోచిస్తున్నాను.

"నిన్న పులుసు కూర గిన్నెల్లో తీస్కబోయిన అవి మర్చిన పొద్దుగాల కొంచెం దూరం పోయినంక గుర్తొచ్చింది. అందుకని మల్ల యింటికి పోయిన నేను గిన్నెల కోసం పోకుంటే ఏమయితుండెనమ్మ...

వాడయితే, నా బిడ్డని, అట్లనే కుర్సీకి "కాళ్ళు, చేతులు కట్టిండు. నోట్లో బట్టలు పెట్టిండు. ఏదో అంటూ ఉన్నాడు. నేను ఇంక ఏం ఆలోచించకుండ గొడ్డలి తీసిన... ఆడు నన్ను చూడలేదు ఎనకసంది మెల్లగ పోయి ఆడిని కొట్టిన సంపిన.

లీలమ్మా! నేను తప్పు చెయ్యలే. తప్పుచేసిన అని అంటే నాకేం బయ్యం లేదు" కళ్ళల్లో ఎరుపు, ఆవేశం.

నాకేం తోచలేదు. తప్పో ఒప్పో ఏదయినా కానీ చట్టాన్ని ఎలా తన చేతుల్లోకి తీసుకుంది? అంతా అయోమయంగా అనిపించింది. ఏవిటిలా జరిగింది?

నోట్లోంచి ఒక్క మాట రానియ్యని యాదమ్మ నిశ్శబ్దంగా తన మానాన తాను వెళ్ళిపోయే యాదమ్మ యిలా కూడ ఉండగలదా! ఉండగలదు అని ఇప్పుడు తెలిసింది – ఆ కళ్ళల్లోని ఎరుపు, రౌద్రం, ఆవేశం చూసాక.

దుష్టుల్ని చంపడానికి కాళికావతారాన్ని కూడా ఎత్తగగలదు ఈ యాదమ్మ.

"అమ్మా!" మెల్లిగా అంది.

'ఏం' అన్నట్లు తల ఎత్తాను.

"జర్ర పాపని చూడండమ్మా"

మరోసారి ఆలోచించలేదు. నా మాటని అత్తయ్య కానీ, ఆయన కానీ తప్పుట్టరు. అందుకే 'అలాగే' అన్నాను.

ఆ రోజంతా మా వీధిలో, టీవిలో, అన్ని ఛానెళ్ళల్లో, ఇదే సంగతి. ఇదే చర్చ.

చచ్చిపోయిన సంతోష్ తండ్రిని, తల్లిని బాగా క్లోజప్‌లో చూపిస్తూంటే, యాదమ్మ చేసింది చాలా తప్పని, వాళ్ళ చుట్టు ఉన్న బంధువులు, మిత్రులు అంటున్నారు. యాదమ్మకి మరణశిక్ష వెయ్యాలని కూడా అంటున్నారు.

మా వీధిలోని ఆడవాళ్ళం అందరం కూడా యాదమ్మని గురించే చర్చించుకున్నాం.

"ఈ రోజున యాదమ్మ కూతురయింది. రేపు మరో అమ్మాయి. చదువుకున్న అమ్మాయి అయినా, ఉద్యోగం చేసే అమ్మాయి అయినా, రైల్లో ప్రయాణించే స్త్రీ అయినా, ఆడుకుంటున్న పసిమొగ్గ అయినా నడివయసులో ఉన్న పడతి అయినా, ఎవరయితేనేం... వయసుతో సంబంధంలేదు అవస్థ మాత్రం ఒకటే... వ్యవస్థలో ఏం మార్పులేదు...

స్త్రీకున్న హక్కుల్లో మొదటిది స్వేచ్ఛగా తలెత్తుకుని తిరగడం, అది కూడా లేని బతుకైంది..."

యాదమ్మ నేరస్థురాలు కాదు. ఖూనీ కాదు... ఆమెకి శిక్షపడకూడదు..."

"మనం అందరం హోంమంత్రిగారి దగ్గరికెళ్దాం..."

"కష్టపడి సంపాదించిన స్వరాజ్యం, దాని సంపూర్ణ స్వరూపం ఇలా వికృత రూపం దాల్చి మన సమాజాన్ని కలుషితం చేస్తోంది."

యాదమ్మకి న్యాయం జరుగుతుందా! అనుమానమే.

ఎందుకంటే, న్యాయస్థానం ముందే నేరాలు జరుగుతున్న రోజులు ఇవి. రాతియుగం నుంచి, ఈ రోజు వరకు ఆటవిక నాగరికతే మన సమాజాన్ని ఏలుతోంది.

సంతోష్ లాంటి ఉన్మాదులెక్కువై రాక్షస కేకలు వేస్తూంటే యాదమ్మ దాని కూతురు స్వరూప లాంటి వాళ్ళ నిస్సహాయ, నిశ్శబ్ద రోదనలు ఎవరికి వినపడ్డాయి?

పాప పుణ్యాలు, నరకం స్వర్గం వీటిమీద, ప్రభుత్వంమీద, న్యాయవ్యవస్థమీద నమ్మకం యాదమ్మకి ఉందో లేదో తెలీదు. కానీ కూతుర్ని రక్షించుకోవాలన్న మొండి ధైర్యం ముందు అన్నీ తలవంచుకున్నాయి.

యాదమ్మ సంతోష్‌ని చంపకపోతే, వాడు స్వరూపని చంపేసేవాడే. వాణ్ణి జైల్లో పెట్టేవారు, ఓ ఉన్మాది అని అంటారు. ఉన్మాదికి శిక్ష కఠినంగా ఉంటుందా లేదా! ఉంటే, ఆ శిక్ష పడడానికి, యాదమ్మకి న్యాయం జరగడానికి రోజులు నెలలు కాదు, ఏకంగా ఏళ్ళే పడ్తుంది. ఎందుకంటే న్యాయస్థానం ఎప్పుడు బద్ధకంగా ఉంటుంది.

మా అందరికీ ఒకటే సంఘర్షణ.

న్యాయం ఎవరి పక్షాన ఉంటుంది? ఎవరికి న్యాయం జరుగుతుంది? యాదమ్మకా! స్వరూపకా! చచ్చిపోయిన సంతోష్‌కా!

ఒకవేళ యాదమ్మకి చంపే హక్కు లేదంటూ న్యాయం జరగకపోతే,

మహిళా జాతి ఓడిపోయినట్లేనా? ఆ రోజు తీర్పుని జడ్జిగారు యిస్తారు.

అందరం కోర్టు బయట ఉన్నాం - చెట్లకింద, ఫుట్‌పాత్‌మీద, మెట్లమీద గుంపులు గుంపులుగా.

"సాక్ష్యలని బట్టి, ఆధారాలని బట్టి, తేలినదేమిటంటే, యాదమ్మ తన కూతురు ప్రాణం తియ్యబోతున్న సంతోష్‌ని హత్య చేసింది కూతుర్ని రక్షించడానికే. అందుకే ఆమెను విడుదల చేస్తున్నాం."

మా చెవుల్ని మేము నమ్మలేకపోయాం.

ఓ డబ్బున్న మనిషి శక్తిముందు, ఓ మామూలు పనిమనిషికి విజయ లభించింది.

గూండాయిజానికి శక్తి ఉండొచ్చు, కానీ నిజానికున్న శక్తి యింకా ఎక్కువే. దానికున్న విలువకి ఎప్పుడూ గెలుపే లభిస్తుంది. అందుకే యాదమ్మ గెలిచింది.

(ఆంధ్రభూమి దిన పత్రిక ఫిబ్రవరి 17 2007)